## బొమ్మ వెనుక

"సాగర్ ఈ రోజు విశేషమేంటో తెలుసా? మన చంటి పుట్టిన రోజు. నీకు జ్ఞాపకముందా? అప్పుడే సంవత్సరం పూర్తయింది. గత సంవత్సరంలో ఎన్ని సంఘటనలు ? ఇప్పుడు నువ్వు పూనాలో, నేను అమెరికాలో! ఎందుకు? మన మనస్పర్థల మధ్య బాబు ఎందుకు నలిగిపోవాలి? తండ్రి ప్రేమనెందుకు కోల్పోవాలి? ఆలోచించు."

రజని మెయిల్ చూసి సాగర్ నవ్వుకున్నాడు. మొగుణ్ణి కొట్టి మొగసాల ఎక్కడం అంటే ఇదేనేమో? తనను కాదని పుట్టింటికి వెళ్లిందెవరు? ఆమె కోసం తాను హైదరాబాద్ వస్తే అమెరికాకు ఉడాయించిందెవరు?

"నీ ప్రశ్నలకి సమాధానం నీలోనే వెతుక్కో. చేసిందంతా చేసి ఇప్పుడు నన్ను ఆలోచించమనడం నీకే చెల్లింది. నేను బాగా ఆలోచించే ఇండియా తిరిగి వచ్చాను. ఇక ఆలోచించాల్సింది నువ్వే. నీ కోసం నా ఇంటి ద్వారాలు తెరిచే ఉన్నాయి."

రజనికి జవాబు మెయిల్ ఇచ్చి ఆలోచనల్లో పడ్డాడు సాగర్.

❂❂❂

అవి పెళ్ళైన తర్వాత రజనితో అమెరికాలో కొత్తగా కాపురం పెట్టిన రోజులు. ఆర్నెల్లు ఆరు క్షణాలుగా గడిచాయి. ఆ పైన....

రజని అసలు స్వభావం తెలియసాగింది. అప్పుడే నవ్వుతూ తుళ్ళుతూ కబుర్లు చెప్పడం, అంతలోనే మూడీగా తయారవడం, చీదరించుకోవడం, బెడ్రూం తలుపులు బిడాయించుకుని గంటలకు గంటలు గడపడం.

ఓ రోజు...

తన ఆఫీసు సహచరుడు చోప్రా ఇంటికి వెళితే అక్కడ రజని ప్రవర్తనతో తల తీసేసినట్టయింది. వాళ్లడిగిన కుశల ప్రశ్నలకు కూడా పుల్ల విరుపు సమాధానాలు. పాపం వాళ్ల రెండేళ్ళ అబ్బాయి, 'ఆంటీ' అని దగ్గరికి వస్తే చీదరించుకోవడం, తన చీర నలిగిందని రభస. చోప్రా, అతని భార్య అవాక్కయ్యారు. మనసు విరిగిన తను వాళ్లెంత కోరినా భోజనం చేయకుండానే వెనుతిరిగాడు. కార్లో తిరిగి వస్తూ రజనిని సంజాయిషీ అడిగితే, అదే తలబిరుసు సమాధానం. తను కోప్పడితే నడిచే కార్లోంచి దూకడానికి ప్రయత్నించడం, తను జడ పట్టుకుని ఆపబట్టి గాని అంత అఘాయిత్యమూ చేసేదే. తనను కాపాడిందానికి కృతజ్ఞతతో ఉండడానికి బదులు, జడ పట్టి కారులోంచి తోయడానికి ప్రయత్నించాడని పోలీసులకు ఫిర్యాదు. తను ఓ రోజు లాకప్పులో గడిపి అయిదు వందల డాలర్లు జరిమానా చెల్లించి మరునాడు బయటపడ్డాడు.

ఇంత జరిగినా సాగర్ హైదరాబాద్‌లోని తన తల్లిదండ్రులకు మాట మాత్రం చెప్పలేదు, కాని రజని... తల్లికి ఫోన్లో చెప్పి ఒకటే ఇక ఇకలు పకపకలు.

ఆమె తల్లి మాత్రం తక్కువ తిందా? అలా చేసినందుకు మందలించాల్సింది పోయి, బాగా శాస్తి చేశావని కూతుర్ని తెగ మెచ్చుకుంది. అలా చేస్తేనే మొగుడు చెప్పుచేతుల్లో ఉంటాడని నూరిపోసింది.

ఫోను చేద్దామని రిసీవర్ ఎత్తిన సాగర్‌కు అనుకోకుండా తల్లీ కూతుళ్ళ సంభాషణ వినబడింది. సబబు కాదని తెలిసినా ఆ తర్వాత కూడా రజని పుట్టింటి వాళ్లతో మాట్లాడిన మాటలు రికార్డు చేసే పరికరం బిగించాడు. ఆ మాటలు విన్న తర్వాత రజని విచిత్ర ప్రవర్తన వెనకాల ఎవరున్నారో అతడికి అర్థమైంది.

ఆ తర్వాత మిత్రులెందరో ఇంటికి రమ్మని పిలిచినా వెళ్లేవాడు కాదు సాగర్. ఒకవేళ వెళ్లినా ఒంటరిగా వెళ్ళేవాడు తప్ప రజనిని తీసుకెళ్ళేవాడుకాదు. అలాగే ఎవరినీ తమ ఇంటికి ఆహ్వానించే వాడుకాదు.

అయితే ఓసారి అనుకోని పరిస్థితుల్లో కొంతమంది తెలుగు మిత్రుల్ని వారి కుటుంబాలతో సహా ఆహ్వానించవలసి వచ్చింది.

సాగర్‌కి టీమ్ లీడర్‌గా ప్రమోషనొచ్చింది. ఆ సందర్భంగా అతడితో పాటు పని చేసే తెలుగు మిత్రులు పార్టీ ఇవ్వమని పోరు పెట్టారు. ఏదైనా హోటల్లో ఏర్పాటు చేస్తానంటే అదేంటి? కమ్మటి ఆంధ్రా భోజనం ఆవకాయతో లాగిద్దామంటే హోటలంటావేమిటని నిలదీశారు. పెళ్ళి కాకముందు, అయింతర్వాత కూడా తను ఎందరి ఇంట్లోనో పార్టీలకు హాజరయ్యాడు. ఇప్పుడు తనకు సందర్భం వచ్చింది కాబట్టి, ఆ బాకీ తీర్చుకోక తప్పేట్టులేదు. కాని రజని? ఎలాగో ఒప్పించాలి.

పార్టీ మాట ఎత్తగానే కస్సుమని లేచింది రజని. తన ఇల్లేమి సత్రం కాదంది. అడ్డమైన వాళ్ళకు వండి వార్చటానికి తను తేరగా లేనంది. సాగర్ బతిమాలి బామాలి ఒప్పించేసరికి తాతలు దిగొచ్చారు.

పార్టీ రోజు రానే వచ్చింది.

ముప్పావు వంతు వంట తనే కానిచ్చాడు. రజని అంటీముట్టనట్టు ఉంది. స్నేహితులు వారి కుటుంబాలతో సహా ఒక్కొక్కరు రాసాగారు. మాట వరసకైనా వారికి స్వాగతం పలికి పలకరించిన పాపాన పోలేదు రజని. సాగర్ మాత్రం అందరినీ ఆప్యాయంగా ఆహ్వానించి వారికి నిమ్మరసం అందించాడు.

కొందరు ఆడవాళ్ళు చొరవ తీసుకుని వంటింట్లోకి వెళ్ళి రజనిని పలకరిస్తే అదే పుల్లవిరుపు సమాధానాలు. ఈ పార్టీ ఇవ్వడం తనకే మాత్రం ఇష్టం లేనట్టు పరోక్షంగా సూచించింది. దాంతో పాపం వచ్చిన వాళ్ళు చాలా బాధపడ్డారు. సాగర్ ముఖం చూసి ఊరుకున్నారు. భోజనం మొదలైంది. వంట పాత్రలు టేబిల్ మధ్య పెట్టారు. ఎవరికి వారు వారికిష్టమైన పదార్థాలు వడ్డించుకుని తింటున్నారు. అందరిలా రజని కూడా ఓ పళ్లెం తీసుకుని తింటోంది. సాగర్ మాత్రం అందరినీ పలకరిస్తూ ఎవరికేం కావాలో అవి అందిస్తున్నాడు. ఈ భార్యాభర్తల వాలకం చూసి, వచ్చిన వారికి చాలా విషయాలు అర్థమయ్యాయి. భోజనాలయ్యాక అందరూ కలిసి ఓ షోపీస్ బహూకరించి అభినందనలు తెలిపారు సాగర్‌కి. రజనిలో అదే ముభావం. సాగర్ మాత్రం అపార్ట్‌మెంట్ కింది దాకా వెళ్లి అందరికీ పేరుపేరునా వీడ్కోలు చెప్పాడు.

ఫోను రింగుతో వర్తమానంలోకి వచ్చాడు సాగర్. హైదరాబాద్ నుండి తండ్రి ఫోన్. సాగర్ తాము కలిసి రజనిని ఎన్నో హింసలు పెట్టామని ప్రచారం చేస్తున్నారట వియ్యాలవారు. వాళ్లు సృష్టించిన వదంతుల గురించి చెబుతూ బాధపడ్డారు తల్లిదండ్రులు. వారిని ఓదార్చి ఫోను పెట్టేశాడు సాగర్.

అతడి మనసు వికలమైంది. తన జీవితం ఎందుకిలా అయిందో అర్థంకాలేదు. రజనికి తనేం తక్కువ చేశాడు? కానీ కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నాడే? అదే తను చేసిన పొరపాటేమో? అందరు అమెరికా పెళ్లికొడుకుల్లాగా లక్షలు కట్నం తీసుకుని, లాంఛనాలని, ఇంకొన్ని లక్షలు గుంజితే తన విలువ పెరిగేదేమో?

అమెరికా నుంచి సెలవుపై వచ్చి హడావుడిగా కుదుర్చుకున్న సంబంధం కూడా కాదాయే. తన ఇండియా రాకకు ఆర్నెల్ల ముందు నుంచి కనీసం పదిమంది అమ్మాయిలను చూసి, వారి పూర్వాపరాలు వాకబు చేసి, రజనిని, ఇంకొక అమ్మాయిని ఎంపిక చేశారు అమ్మా నాన్న. తను వచ్చి ఆ ఇద్దరిలో రజనిని ఎన్నుకున్నాడు. ఇంకేముంది? ఇరవై రోజుల్లో పెళ్ళి, మరో నెల రోజుల్లో అమెరికాలో కాపురం పెట్టాడు. ఆ తర్వాత మూడేళ్లకే తను అక్కడి ఉద్యోగం వదలి ఇండియా రావాల్సి వచ్చింది. రజని పుట్టింటి నుంచి అక్కడికి రానంటేనే గదా తను అమెరికా విడిచి ఇండియాకు తిరిగి వచ్చింది! కానీ రజని? మళ్ళీ అమెరికా వెళ్లింది. ఈ దాగుడు మూతలెందుకు? ఎందుకు తనకీ మనస్తాపం? సాగర్ బుర్ర వేడెక్కింది. ఆలోచనలకు స్వస్తి చెప్పి సినిమాకి బయలుదేరాడు.

రోజులు భారంగా గడుస్తున్నాయి. అతడి జీవితం దారీ గమ్యం తెలీకుండా గడుస్తోంది. ఆఫీసులో ఉన్నంతసేపు హాయిగా ఉంటుంది. బయటి ప్రపంచపు ధ్యాసే ఉండదు. పనిలో నిమగ్నమైతే ఇక ఈ లోకంలో ఉండదు సాగర్. తన గదికి వచ్చింతర్వాత మాత్రం కాలం గడవడం దుర్భరమైపోతోంది. ఒంటరితనం తట్టుకోలేక వారం రోజులు సెలవుపెట్టి హైదరాబాద్ వెళ్లాడు సాగర్.

అక్కడ రజని, ఆమె పుట్టింటి వాళ్ళ కుట్రలు తెలిసి మరింత క్షోభకు గురయ్యాడు.

అమెరికాలోని సాగర్ ఆస్తిపై కన్ను పడింది – రజని అమ్మా నాన్నలకు. అమెరికాలో తన పదేళ్ల సర్వీసులో పెద్దఇల్లు, మంచి కంపెనీల్లో షేర్లు... ఇలా దాదాపు ఎనిమిది కోట్ల ఆస్తి కూడబెట్టాడు సాగర్. అమెరికాలో విడాకుల దావా గెలిస్తే అక్కడి నియమాల ప్రకారం రజనికి సగం ఆస్తి, నెల నెలా భరణం మంజూరవుతుంది.

దాదాపు నాలుగు కోట్ల ఆస్తి తన కూతురిదవుతుంది. అంటే, పరోక్షంగా తమ పరమవుతుంది.

అందుకని సాగర్ ఇండియాలో అడుగు పెట్టగానే రజనిని పది నెలల బాబుతో సహా తిరిగి అమెరికా పంపించారు.

తమ స్వార్థం కోసం కూతురు కాపురాన్నే కూల్చడానికి తయారయ్యారు. కానీ, రజని? ఆమె వివేకమేమయింది? సాగర్‌కి అంతా అనూహ్యంగా వుంది. అత్తవారి పథకం మాత్రం స్పష్టమయింది.

తను, రజని అమెరికాలో ఉన్నప్పుడు వాళ్లన్నయ్య పంపిన ఈ మెయిల్ గుర్తొచ్చింది. తను వాడిన జేబురుమాలో, టవలో పంపమని ఆ మెయిల్ సారాంశం. ఏవో క్షుద్ర పూజలు చేయించి సాగర్ రజని మాట జవదాటకుండా చేయాలని వాళ్ళ ప్లాన్. క్షుద్ర తంత్రాల మీద నమ్మకం లేని తను అప్పుడంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, ఇప్పుడు ఆలోచిస్తే...?

ఆ తర్వాతే కదూ రజని తన తల్లిదండ్రుల దగ్గరికని హైదరాబాద్ వచ్చింది? హైదరాబాద్‌లో పుట్టింట్లో దిగిన రజని సాగర్ తల్లిదండ్రులను ఫోన్లో కూడా పలకరించ లేదు.

అప్పట్లో జరిగిన సంగతి గురించి తల్లి ఫోన్లో చెప్పిన మాటలూ మదిలో మెదిలాయి..

"మనవణ్ణి చూద్దామని వియ్యాలవారింటికి వెళితే రజని లోపలి గది నుండి బయటకు రాలేదు. నోరు తెరిచి బాబు గురించి అడిగితే దూరం నించే చూపించారు తప్ప మా దగ్గరకు రానివ్వలేదు. ఆ అవమానం భరించలేక వెంటనే లేచి వచ్చాం. రజని హైదరాబాద్ వచ్చాక రెండురోజులు ఎక్కడికో వెళ్లి పూజలు చేశారని తెలిసింది. ఏం మంత్రాలు చేయించారో ఏమో?"

సాగర్ ఇంకా కలత చెందాడు. ఇక ఉపేక్షించి లాభం లేదు. వెంటనే పెద్దల్ని సమావేశపరచి తాడోపేడో తేల్చుకోవాలి అనుకున్నాడు.

కుల పెద్దల సమావేశంలో...

"ఏదో మంచి కుటుంబం, అబ్బాయి అమెరికాలో పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు గదా అని నమ్మి మా అమ్మాయినిచ్చి పెళ్లి చేస్తే దాని జీవితం గంగపాలైంది. దేశంగాని దేశంలో మా అమ్మాయిని పెట్టిన హింస చెప్పనలవి కాదు. ప్రతి రెండు రోజులకొకసారి కొట్టడం, అడ్డమైన స్నేహితులను ఇంటికి పిలిచి వారికి వంటా వార్పూ చేసి పెట్టమనడం. ఎవరెవరో ఉత్తరాది వారి ఇళ్ళకు మా అమ్మాయిని వెంటేసుకుపోయి అక్కడ అవమానించడం అదంతా ఒక ఎత్తైతే, మా అమ్మాయి జుట్టుపట్టుకుని కారులోంచి తోయడం ఇంకో ఎత్తు. ఆ భగవంతుడి దయవల్ల మా అమ్మాయి బతికి బట్టకట్టింది కానీ, అతడి ఆగడాలకు ఎప్పుడో హరీ మనేదే. మా వియ్యాలవారేం తక్కువ తిన్నారా? వాళ్ళూ మా అమ్మాయి కాన్పుకని అమెరికా వెళ్లి రాచిరంపాన

పెట్టారు. తలుపు, కిటికీలు మూసి, గ్యాసు తెరిచి ఉంచి చంపాలని చూశారు. దైవ వశాత్తు త్రుటిలో ప్రమాదం తప్పింది. అంత జరిగినా మా అమ్మాయి ఓర్పుతో అన్నీ సహించింది. వారం వారం ఫోన్ చేసి బాగున్నాననే చెప్పేది కాని తను పడ్డ యాతన గురించిమాత్రం చెప్పలేదు. బాబు మూణ్ణెళ్ల వాడయ్యేదాకా ఎలాగో ఓర్చుకుని ఇక భరించలేక మా దగ్గరకు వచ్చేసింది. ఆ తర్వాతే మాకన్ని విషయాలు తెలిశాయి. ఇంత జరిగాక మా అమ్మాయిని కాపురానికెలా పంపమంటారో చెప్పండి" రజని తల్లి ఏడుస్తూ ముక్కు చీదుతూ చెప్పింది.

ఆవిడ మాటలు విని సాగర్, అతడి తల్లిదండ్రులు అవాక్కయ్యారు. తమపై వేసిన అభాండాలతో వాళ్లు ఆశ్చర్యంతో పాటు అమితంగా బాధకు గురయ్యారు. సాగర్ ఎలాగో తమాయించుకుని...

"ఇదంతా వింటూంటే వాళ్లేదోపెద్ద పథకం వేసినట్టుంది. వీళ్లు చెప్పిందంతా పచ్చి అబద్ధం. తమ తప్పును కప్పి పుచ్చుకోవడానికి అల్లిన కట్టుకథ. వారానికొకసారి ఫోను చేసేదని చెప్పారే అది శుద్ధ అబద్ధం. రోజుకు కనీసం రెండుసార్లు ఫోను చేసి ఇరవై నిముషాలకు తక్కువ కాకుండా వీళ్లతో మాట్లాడేది రజని. కావాలంటే టెలిఫోన్ బిల్లు కాపీలు చూపిస్తాను. ఆ మాటల్లో నన్ను తన గుప్పిట్లో ఎలా పెట్టుకోవాలో నూరిపోసేది మా అత్తమ్మ. నన్ను పెట్టిన బాధలు చెప్పి తల్లీబిడ్డలు ఒకటే సంబర పడేవారు. వాళ్లమ్మాయి తప్పులేకుంటే నేను హైదరాబాదులో దిగిన మర్నాడే అమెరికా ఎందుకు వెళ్లిందో అడగండి. రజని కాన్పు సమయానికి వాళ్లకు రావడం కుదరదంటేనే మా వాళ్లను పిలిపించుకున్నాను. వచ్చిన వాళ్ళను ఏనాడూ ఆప్యాయంగా పలకరించిన పాపాన పోలేదు రజని. పైపెచ్చు అలగా జనాలు, అలగా కుటుంబం అని ఈసడించు కునేది. ఈటెల్లాంటి మాటలతో కించపరచేది. నేనేమైనా మందలిస్తే నామీద మా అమ్మానాన్నల మీద పోలీసు కంప్లైంటు ఇస్తానని బెదిరించింది. ఆ బెదిరింపులకి భయపడి మా వాళ్ళను వారం రోజులు నా మిత్రుడి ఇంట్లో ఉంచాను. కాన్పు అయి, రజని హాస్పటలు నుంచి వచ్చిన మూడో రోజే మా వాళ్లని హైదరాబాద్ పంపాల్సి వచ్చింది. ఇదంతా నా ఆస్తి కాజేయడానికి మా అత్తా మామలు పన్నిన పన్నాగం. వీళ్ళు రజనితో మాట్లాడిన సంభాషణలు రికార్డు చేశాను. అవి వింటే మీకే విషయం అర్థమవుతుంది.

ఇక్కడ విడాకులు తీసుకుంటే అక్కడి నా ఆస్తిలో చిల్లిగవ్వ దొరకదు. ఇక్కడి అవసరాల ప్రకారం, భరణం కూడా తక్కువే వస్తుంది. అందుకని అక్కడ విడాకులు తీసుకోవడానికని తమ కూతుర్ని అమెరికా పంపించారు వీళ్ళు. తన దగ్గరున్న

డూప్లికేటు కీతో తాళం తీసి నా ఇంట్లోనే వుంటోంది రజని. అంతేకాదు, మా జాయింట్ ఎక్కౌంటు నుండి దాదాపు పాతిక లక్షలు తీసింది రజని. దీనికి మీరేమంటారు ?"

"రామ...రామ మా కూతురి కాపురంలో నిప్పులు పడ్డ తర్వాత ఆస్తి మేమేం చేసుకోవాలి? ఇదంతా మమ్మల్ని అప్రతిష్ట పాలుచేయడానికి వీళ్ళే ఆడుతున్న నాటకం" రజని తండ్రి ఎదురుదాడి చేశాడు.

రెండు వైపులా వాదనలు విన్న పెద్దలకు ఎవరి మాటలు నమ్మాలో అర్థం కాలేదు. అమ్మాయి అబ్బాయి సమక్షంలోనే అన్ని విషయాలు తేల్చుకోవచ్చు గనుక అమ్మాయిని అమెరికా నుండి పిలిపించమని రజని తల్లిదండ్రులకు సూచించి సమావేశం ముగించారు.

ఇక తను హైదరాబాదులో ఉండి ప్రయోజనం లేదని సాగర్ పూనా బయలుదేరాడు.

వారం రోజుల తర్వాత సాగర్ నాన్నగారి దగ్గర నుంచి ఫోన్, అమెరికా నుంచి ఏవో కాగితాలు వచ్చాయట. రజని పెట్టుకున్న విడాకుల పిటీషన్ నోటీసు, కొన్ని డాక్యుమెంట్లు ఉన్నాయట. అవి పూనా పంపమని చెప్పి ఫోను పెట్టేశాడు సాగర్.

ఆ కాగితాలు అందిన వెంటనే అమెరికాలోని తన మిత్రుడు దీపక్‌కి ఫోన్ చేసి విడాకుల దావాపై వాదించడానికి మంచి వకీలును ఏర్పాటు చేయమని పురమాయించాడు. తనకు విడాకులు అవసరం లేదని, రజని ఇండియా వచ్చి తనతో కాపురం చేసేలా చూడమని కోర్టుకు విన్నవించమన్నాడు. తమ పెళ్లి భారతదేశంలో, హిందూ ధర్మ పద్ధతులతో జరిగినందున విడాకుల కేసు వినడానికి అమెరికా కోర్టుకు అధికారంలేదని వాదించమన్నాడు.

రజని నుంచి మళ్లీ ఈ మెయిల్. సాగర్ అమెరికా రావాలని పోరు... అబ్బాయి కొరకైనా మళ్లీ కలిసి ఉందామని ప్రతిపాదన.

సాగర్‌కు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు. అక్కడ విడాకుల కోసం కోర్టుకెక్కి తనను అక్కడికి వచ్చి కలిసి ఉండమనడం ఎంతమోసం ?

ఆలోచనలో పడ్డాడు సాగర్. అతడి ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ఫోన్ మోగింది. హైదరాబాద్ నుండి సాగర్ తండ్రి చేసిన ఫోన్. రజని ఇండియాకు రానని మొండికేయడం వల్ల, తాము ఆశక్తులమని, రజని తండ్రి కులపెద్దలకు తెలిపాడట. విషయం అమెరికాలోని కోర్టులో ఉండడం వల్ల తామేం చేయలేమని చేతులెత్తేశారట కుల పెద్దలు.

ఎందుకెత్తేయరూ? చికెన్, మందు పార్టీతో బాగా 'ట్రీట్' పొందిన ఆ 'పెద్దలు', రజని తల్లిదండ్రులకు విరుద్ధంగా ఎలా మాట్లాడుతారు?

ఏడవలేక నవ్వుకున్నాడు సాగర్. ఏదో సామరస్యంగా సమస్యకు పరిష్కారం లభిస్తుందనుకుంటే రజని పడనిచ్చేట్టులేదు. ఇక తనేం చేయగలడు, కోర్టు తీర్పు కోసం వేచి వుండడం తప్ప!

✪✪✪

అక్కడ అమెరికాలో...

రజని, ఆమె తల్లిదండ్రులు అప్పనంగా వచ్చిన ఆస్తిని హాయిగా అనుభవిస్తున్నారు. అటు విడాకుల పిటీషన్ దాఖలు చేసి, ఇటు తన తల్లిదండ్రుల్ని పిలిపించుకుంది రజని., జాయింటు ఎక్కౌంటు నుంచి డ్రా చేసిన పాతిక లక్షలు జల్సాగా ఖర్చు పెట్టుకుంటున్నారు వాళ్ళు. కూతురు కాన్పుకు అమెరికా వెళ్లడం కుదరని వారికి కూతురు కాపురాన్ని విడదీయడానికి మాత్రం వెసులుబాటు దొరికింది.

ఇండియాలో క్లాసుమేటు, అమెరికా అబ్బాయిని పెళ్లి చేసుకున్న దీప్తి, రజనిని కలవడానికి వచ్చింది. ఆమె కాపురం గురించి తెలిసి బాధపడింది. ఎందుకలా జరిగిందని అడిగితే

"ఏం చెప్పాలి దీపూ, సాగర్ పేరుకే పెద్ద ఉద్యోగం చేస్తున్న ఇంజనీరు. కానీ అన్నీ లేకిబుద్ధులే. ఎంతసేపూ తన చిన్నతనం గురించి, తను ఎలా కష్టపడి స్కాలర్ షిప్పులతో చదివి పైకొచ్చాడో ఏకరువు పెట్టడం, తను పుట్టి పెరిగిన పల్లెటూరును పొగడడం తన వాళ్లకు ఏ లోటూ రాకుండా చూడాలని ఆలోచన తప్పితే, ఈ రోజుల్లోని అబ్బాయిల్లా చలాకీగా, షోకుగా ఉండడం చాతకాని దద్దమ్మ. 'రోములో' రోమన్ల లాగా ఉండు' అనే తత్వం ఏ మాత్రం ఒంటబట్టని చద్దిముద్ద. ఒక్క నైట్‌క్లబ్‌కు కూడా వెళ్లడమనేదే లేదు. వారాంతంలో పిక్‌నిక్‌లకు వెళ్లడంలేదు. ఎంతసేపు తనలాంటి పల్లెటూరి నేపథ్యమున్న స్నేహితులతో గడపడం, వాళ్లిళ్ళలకు వెళ్లడం. వారిని మా ఇంటికి పిలవడం. ఇలాంటి వాడితో ఏ ఆడదైనా ఎలా కాపురం చేస్తుంది చెప్పు? అసలు మనం అమెరికా ఎందుకు వచ్చాం? హాయిగా, జల్సాగా జీవితం ఎంజాయ్ చేయడానికి గదా. ఎక్కడకు పోయినా సవతి పోరు తప్పదన్నట్టు ఇంత ఫార్వర్డు దేశంలో కాపురమున్నా, బ్యాక్వర్డ్ ఇండియా గురించే గొప్పగా ఆలోచించే సాగర్‌తో ఎలా వేగాలి చెప్పు?

"ఇదంతా వింటుంటే, అనవసరంగా జీవితంతో ఆటలాడుకుంటున్నావనిపిస్తోంది. నువ్వు చెప్పిందాన్ని బట్టి చూస్తే, ఇందులో సాగర్‌కంటే నీవైపు నుంచే ఎక్కువ లోపం ఉన్నట్టు తోస్తోంది. మన దేశం వదలి ఇక్కడికి వచ్చిన తర్వాత, ఎవరికైనా తమ

ఊరు, తమ వాళ్ళు జ్ఞాపకం రావడం సహజం. సాగర్ తన గతం మరిచిపోక పోవడం మంచి లక్షణం తప్ప అవలక్షణం కాదు. నడమంత్రపు సిరితో మురిసిపోకుండా కాళ్ళు భూమిమీదే ఉంచగల్గడం అందరికీ సాధ్యం కాదు. ఇక పిక్నిక్కులు, షికార్లంటావా, అవి ప్లాను చేసుకోవడం నీ చేతుల్లో వుంది. నువ్వు చెప్పిందాన్ని బట్టి సాగర్ మెతక స్వభావం ఉన్నవాడిలా ఉన్నాడు. అతణ్ణి నీకనుగుణంగా మలచుకోవడం నీ చేతుల్లో ఉంది. అలా చేయకుండా ఏకంగా విడాకుల దాకా వెళ్ళడం నాకు నచ్చలేదు."

"నీకు నచ్చినా, నచ్చకపోయినా నేను ఖాతరు చేయను, నా అభిరుచులకు తగ్గట్టు బతకడమే నాకు కావలసింది. ఈ విషయంలో ఎవరి మాటను వినదల్చుకోలేదు" రజని తెగేసి చెప్పింది మిత్రురాలికి.

"అది కాదు రజ్జూ, చిన్న చిన్న పొరపచ్చాలకు విడాకులు తీసుకోవటం పరిష్కారం కాదు. ఈ వయసులో విడాకులు తీసుకుని మిగతా జీవితం ఎలా గడుపుదామని? ఈ పసికందుని అమెరికాలో పెంచి పెద్దచేయడం అంత సులువనుకుంటున్నావా? మగతోడు లేకుండా దేశంగాని దేశంలో ఎలా నెగ్గుకొస్తావు?" స్నేహితురాలి ధోరణి విసుగు కలిగించినా అది బయటపడనీయకుండా నెమ్మదిగా నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తూ అంది దీప్తి.

"నీ పాత చింతకాయ పచ్చడి ఆలోచనలు, అమెరికా వచ్చింతర్వాత కూడా అలాగే ఉన్నాయి. నువ్వూ, సాగర్ ఒకే ఓడలో ప్రయాణం చేస్తున్నారు. అందుకే అతణ్ణి సమర్థిస్తున్నావు. విడాకులు వచ్చింతర్వాత నేను ఒంటరిగా ఉంటానని ఎలా అనుకున్నావు? నా అభిరుచులకు తగ్గ మనిషిని ఎప్పుడో ఎంచుకున్నాను. నేనెలా సాగర్‌తో విసిగిపోయానో, అతడూ తన భార్యతో విసిగిపోయాడు. అతడి భార్యకు కూడా ఇండియా వాసనలు పోలేదు. మన సంస్కృతి, మన వారసత్వం అంటూ ఎప్పుడూ పూజలు, పునస్కారాలతో వేధించుకుతింటోంది అతణ్ణి. అందుకే అతడు తన భార్యకు విడాకులిస్తున్నాడు. మా విడాకులు మంజూరు కాగానే, మేం హాయిగా కలిసి ఉంటాం."

"పెళ్ళి కాకుండానే" దీప్తి అడిగింది.

"అవును. పెళ్ళంటే మళ్ళీ మగవాడి అధిపత్యం సహించాలి. అతనిక్కూడా పెళ్ళి బంధంలో ఇరుక్కోవడం ఇష్టంలేదు."

"ఇంతకీ ఎవరే అతడు?"

పేరు చెప్పింది రజని.

"అతడా" నోరు తెరిచింది దీప్తి.

"అతడా? అని అంతలా ఆశ్చర్యపడదానికేముంది? అతడే అమెరికాలో నాకు ఫ్రెండ్. ఫిలాసఫర్ అండ్ గైడ్. విడాకుల విషయంలో అతడే నాకు సహాయపడు తున్నాడు."

"సహాయ పడతాడు. ఎందుకు పడడూ? బంగారు పిచ్చుక తనకై తాను పంజరం లోకి వస్తే అలాంటి వాళ్ళు వద్దంటారా? నేను విన్నదాన్ని బట్టి అతడో శాడిస్టు. తన భార్యని హింసించని రోజు లేదు. ఆమె ఇంట్లో ఉండగానే ఎవరెవరో అమెరికన్ అమ్మాయిల్ని తీసుకొచ్చి కులుకుతుంటాడు. వచ్చిన జీతమంతా తాగడానికి, జల్సాలకీ ఖర్చు చేసే మనిషి. అతడూ, సాగర్ దాదాపు ఒకేసారి అమెరికా వచ్చారు. సాగర్ కూర్చుకున్న ఆస్తులు, అతడికున్న పరపతి ముందు, ఇతడు గడ్డిపోచకు కూడా కొరగాడు. ఇతడి గురించి ఇక్కడి మన తెలుగువాళ్ళలో తెలియని వాళ్లు లేరు. అలాంటి వాడి మాయలో నువ్వెలా పడ్డావే రజ్జూ?'

"చాల్లే నీ సోది. మన అమ్మలక్కలు చెవి కొరుక్కోవడాలు విని, నేనూ నీలానే అనుకున్నాను. కాని అతడితో కొన్ని సాయంత్రాలు గడిపాక అతణ్ణి ఎవరూ అర్థం చేసుకోలేదని దృఢపర్చుకున్నాను. అతని సహచర్యంలో టైమ్ ఎలా గడుస్తుందో అర్థం కాదు. అదే సాగర్‌తోనైతే దినమొక యుగంలా ఉంటుంది."

"కీడెంచి మేలెంచమన్నారు. నీ ఆస్తిని, నిన్ను వాడుకుని, ఆ తర్వాత వదిలేస్తే నీగతి?"

"ఆ మాత్రం ఆలోచన నాకు లేదనుకున్నావా? నేను ఎమ్మెస్ చేశాను. విడాకులు మంజూరు కాగానే, నా అర్హతలకు తగ్గ ఉద్యోగంలో చేరతాను, 'అతడి'తో కలిసి ఉంటాను. మేమిద్దరం రాజురాణీల్లా అమెరికా జీవితాన్ని జుర్రుకుంటాం. అప్పుడప్పుడు నువ్వు వచ్చి చూస్తుండు" గర్వంగా తలెత్తి ధీమాగా అంది రజని.

"ఏమో రజ్జూ నేను నీ అంత ఫార్వర్డ్ కాను. నా పరిధిలో నాకు తోచింది చెప్పా. ఆ పైన నీ జీవితం. నీ ఇష్టం. వస్తాను" అని సెలవు తీసుకొంది దీప్తి.

❂❂❂

సాగర్, రజనిల కొడుకు అమెరికాలో పుట్టినందున, అతడు అమెరికా పౌరుడు అయినందున, వారి విడాకుల దావాను విచారించడానికి పూర్తి అర్హతలున్నాయనే రజని వాదనలో బలం ఉండడం వల్ల రజని, సాగర్‌లకు విడాకులు మంజూరు చేస్తూ కోర్టు తీర్పునిచ్చింది. అబ్బాయి చిన్నవాడు కాబట్టి అతడికి తల్లి రక్షణ

ఉండాలనీ, అతడి ఆలనాపాలనకు కొంతసొమ్ము బ్యాంకులో డిపాజిట్టు చేయాలని సాగర్‌కు సూచించింది కోర్టు. రజని ఉద్యోగం చేస్తున్నందున ఆమెకు భరణం మంజూరు చేయలేదు. సగం ఆస్తి ఇచ్చి అబ్బాయి పేరిట కొంత సొమ్ము డిపాజిట్టు చేసి, రజనితో మొత్తం తెగతెంపులు చేసుకున్నాడు సాగర్.

రజని తల్లిదండ్రుల ఆనందానికంతులేదు. వారి పాచిక పారినందుకు బ్రహ్మాండంగా విందు చేసుకున్నారు. ఆస్తుల వివరాలు తెలుసుకుని వాటి నిర్వహణ బాధ్యత నెత్తినేసుకున్నారు. కొన్ని కంపెనీల షేర్లు అమ్మి ఇండియాలో ఆస్తులు కొన్నారు. అటు 'అతడి'కి భార్య నుంచి విముక్తి దొరికింది. క్రెడిట్ కార్డుల అప్పులు తప్ప, ఆస్తులేమీ లేకపోవడంతో అతడి భార్యకు పాపం ఏమీ దక్కలేదు. కాకపోతే నెలనెలా భరణం 'అతడి' జీతం నుంచి ఇవ్వాలని తీర్పునిచ్చింది కోర్టు. భరణం వద్దు, ఏమొద్దు, శాడిస్టు భర్త నుండి విముక్తి దొరికింది అదే పదివేలనుకుని ఆమె ఇండియాలోని తన పుట్టింటికి చేరింది.

రజని 'అతడు' కలసి ఉండడం మొదలుపెట్టారు.

తమ కూతురు పెళ్లి చేసుకోకుండా వేరొకతనితో ఉండడం రజని తల్లిదండ్రులకు మింగుడు పడలేదు. అయినా కుక్కిన పేనుల్లా ఉండిపోయారు. కూతురి విచ్చలవిడి తనం చూడలేక ఓసారి మందలిస్తే వారి మీదే మండిపడింది రజని.

రానురాను రజని తల్లి గొణుగుడు ఎక్కువైంది. అంతకుముందు నీ తల్లిదండ్రులు, నా తల్లిదండ్రులు కారా? అన్న అతడు ఇప్పుడు, వారి మీద విసుక్కోవడం మొదలు పెట్టాడు. పసివాడు పానకంలో పుడకలా తమ జల్సాలకు అడ్డుగా ఉన్నాడని రజనిని దెప్పడం మొదలు పెట్టాడు. ఎలాగైతేనేం, కొంత డబ్బు వదిలించుకుని పెద్దవారిని, పసిపిల్లాడితో సహా ఇండియా విమానం ఎక్కించారు రజని, అతడు కలిసి. కూతురి జీవితం అస్తవ్యస్తం చేసిన పాపానికి రజని సాగర్‌ల అబ్బాయిని పెంచే బాధ్యత వారి నెత్తిన పడింది. అన్ని అడ్డంకులూ తొలగిపోవడంతో రజని, అతడి విశృంఖల విహారం మొదలైంది.

✿✿✿

కాలక్రమంలో రెండు సంవత్సరాలు గడిచాయి. "ఈ సంగతి విన్నారా? రజని మరో అతణ్ణి కూడా వదిలేసిందట" అంది శ్యామల.

"సాగర్‌కి విడాకులిచ్చి 'అతడి'తో ఉండడం మొదలుపెట్టాక నేను రజనితో సంబంధాలు తెంచేసుకున్నాను. అయితే 'అతణ్ణి' ఆ తర్వాత మరో అతణ్ణి కూడా వదిలించుకుందన్న మాట" దీప్తి అంది.

"రజని అతణ్ణి వదలలేదు. రజనిని, ఆమె ఆస్తిని పీల్చి పిప్పిచేసి అతడే రజనిని వదిలేశాడు. ఆ తర్వాత రజని ఇంకో గోరింకను పట్టి అతణ్ణీ ఈ మధ్యే వదిలేసిందట." సుధేష్ణ, తనకు తెలిసిన సమాచారం చెప్పింది.

నెలకోసారి కొన్ని తెలుగు కుటుంబాలు కలిసే గెట్ టు గెదర్‌లో రజని, సాగర్‌ల ప్రస్తావన వచ్చినపుడు జరుగుతున్న సంభాషణ అది.

"అంతా రజని స్వయంకృతం. మరి సాగర్ సంగతో?"

"సాగర్‌కేం హాయిగా ఉన్నాడు. మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. ఆమె కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరే. వాళ్ళకో పాప. ప్రమోషన్‌పై హైదరాబాద్ ట్రాన్స్‌ఫరయ్యాడు. ఇప్పుడతడు తల్లిదండ్రులు, భార్యా బిడ్డలతో, మన రాష్ట్రంలోనే దర్జాగా ఉన్నాడు. బంజారాహిల్స్‌లో బంగళా కొన్నాడు. ఆ మధ్య ఆఫీసు పనిమీద అమెరికా వచ్చి, మా ఇంటికోపూట భోజనానికి వచ్చాడు. మనిషి బాగా ఒళ్ళు చేశాడు. మొహంలో కొత్త కాంతి వచ్చింది" చెప్పింది శ్యామల.

"ఇండియాలో పెళ్ళి చేసుకుని వచ్చి, భార్యల్ని బానిసలుగా చూసే మగాళ్ళ గురించి విన్నాం, కథల్లో చదివాం. కానీ, యోగ్యుడైన భర్తను ఆరళ్ళు పెట్టి, సతాయించి, ఆస్తి మీద ఆశతో విడాకులు తీసుకున్న రజనిని మనం కళ్ళారా చూశాం. సొంత వాళ్ళ చెప్పుడు మాటలు విని, డబ్బు వ్యామోహం, భౌతిక సుఖాల వెంటపడి, జీవితాన్ని కుక్కలు చింపిన విస్తరి చేసుకుంది. చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవ." దీప్తి తన అభిప్రాయం వెలిబుచ్చింది.

"బొమ్మ వెనక బొరుసు ఉంటుంది. అందరు మగవాళ్ళు చెడ్డవాళ్ళు కానట్టే, అందరు ఆడవాళ్ళు మంచివాళ్ళు కారు. సాగర్, రజని, అతడు అతని భార్య నాణెం రెండు వైపులను చూపించారు మనకి" శ్యామల వ్యాఖ్య.

"సాగర్ జీవితం మళ్ళీ గాడిన పడింది కాని, పట్టాలు తప్పిన రజని జీవితం ఎటుమళ్ళుతుందో కాలమే జవాబు చెప్పాలి" అంది సుదేష్ణ.

"మీ ముచ్చట్లు ఈ రోజు పూర్తవుతాయా? మా ఆత్మారాముళ్లను శాంతపర్చే మార్గమేదైనా చూసేదుందా?" శ్యామల భర్త అనగానే అందరూ భోజనాలకు లేచారు.

విపుల

**నవంబరు 2006**